# పరిస్థితుల పలుగురాళ్ళలో

రాజు స్ట్రీట్‌లైటు వెలుగులో ఆమెనుచూసి బిచ్చగత్తేమో అనుకున్నాడు. కాని, ఆమెను పరీక్షగా పరిశీలించాక అలా అనుకోలేకపోయాడు. చదువు, సంస్కారము వున్నదానిలా కనిపించింది అదీకాక ఆమె భిక్షానికి వచ్చిందంటే గూర్ఖా వాచ్‌మెన్ ఒక్కక్షణం నించోనిచ్చేవాడు కాదు.

"ఏం కావాలమ్మా?" అన్నాడు రాజు దగ్గరగావచ్చి.

"మా వారు" అంది ఆమె.

"మీవారా ?....పేరు చెప్పండమ్మా ! పిలుచుకు వస్తాను" అన్నాడు రాజు.

"వెంకటేశ్వర్లు" అంది ఆమె తలవంచుకుని.

రాజు గబగబా లోనికి వెళ్ళాడు అతని మనస్తత్వమే అంత, ఓ వేపు మనిషి బాధపడుతుంటే పట్టించుకోకుండా తోసుకుపోవడము అతనివల్ల కాదు. లోకంలోని పీడితుల్ని, బాధితుల్నిచూసి ద్రవించిపోతాడు నిజానికి మంటల్లో చిక్కుకొన్న మనిషిని చూసి అందరూ ఆందోళన చెందుతారు. కాని, ఏ ఒక్కడో మంటల్లోకి దూకి ఆ మనిషిని రక్షించటానికి పూనుకొంటాడు, ఆ ఒక్కడిలో ఒక్కడే రాజు. అందుకే బ్రతుక్కి, భావనకు లంగరు అందడంలేదు. ఎక్కడా స్థిరంగా వుండలేకపోతున్నాడు, స్కూలు ఫైనల్‌వరకు చదివి, మంచి సంస్కారము వుండి రాజు క్లబ్బులో బోయ్‌గా పని చేయవలసిరావడము నిజంగా అతని దురదృష్టకరము.

ఒకరికి సహాయము చెయ్యబోయి తిట్లు, తన్నులు తిన్న సందర్భాలు ఎన్నో వున్నాయి ఐనా అతను మనుషులకి సేవచేస్తూనే వుంటాడు ఆ సేవలోవున్న తృప్తి, ఆనందం అనుభవిస్తూ, అదే తన జీవిత పరమార్థంగా అనుభవిస్తూ వుంటాడు.

వెంకటేశ్వర్లు పేకాటలో మునిగివున్నాడు. ఒకచేత్తో సిగరెటు, మరొకచేత్తో కార్డులు పట్టుకుని అర్ధనిమీలిత నేత్రాలతో, తదేకంగా చూస్తూ మరో ప్రపంచములో పయనిస్తున్నాడు,

రాజు అతని పక్కగావంగి-"సార్ ! మీకోసం ఆడవాళ్లు వచ్చారు" అన్నాడు నెమ్మదిగా.

వెంకటేశ్వర్లు ఉలిక్కిపడి "ఆఁ ..." అన్నాడు. తను మూడురోజుల నుంచి ఇంటికి వెళ్ళడము లేదని అప్పుడు గుర్తుకువచ్చింది.

"ఎవరో కనుక్కురావోయ్ ?" అన్నాడు నెమ్మదిగా.

రాజు ఏదో చెప్పబోయి అతని ముఖ భంగిమలుచూసి ఆగిపోయాడు

"మీ పేరు ? అడిగి రమ్మన్నారు ?" అన్నాడు రాజు.

ఆమె తలఎత్తి రాజు కళ్ళల్లోకి చూసింది. ఆ కళ్ళలోవున్న దైన్యాన్నిచూసి భరించే శక్తి అతనికి లేదు. అందుకే పక్కకి చూశాడు.

"నా పేరు దుర్గ" అంది,

"సార్ ! ఆమె పేరు దుర్గట" అన్నాడు రాజు వస్తూనే.

"ఎవరోయ్ ఆమె పానకములో పుడకలా ?" అన్నాడొక మిత్రుడు.

వెంకటేశ్వర్లు ముందు తడబడ్డాడు. తమాయించుకుని-"ఆమె మా పనిమనిషిలేరా ! నా మిసెస్ పంపించి వుంటుంది" అన్నాడు.

ఎవరో ఛెళ్ళున కొరడాతో కొట్టినట్లు అదిరిపడ్డాడు రాజు. అగ్ని సాక్షిగా పెళ్ళాడిన భార్యను "పనిమనిషి" అని అనగలిగిన వెంకటేశ్వర్లు ముఖాన్ని చూడలేకపోయాడు. తనను తనే వంచించుకొంటున్న అతనంటే అసహ్యమేసింది. అక్కడ కాలు నిలువలేదు. నెమ్మదిగా అడుగులు వేసు కొంటూ వరండాలోకి వచ్చాడు. "పనిమనిషి....పనిమనిషి" అనే మాటలు వినిపించసాగాయి.

వెంకటేశ్వర్లు పేకాట అనే సుడిగుండములో కొట్టుకులాడుతున్న మనిషిలా కనిపించాడు. నిస్సహాయంగా క్లబ్బుబయట నించుని వున్న ఆమె పరిస్థితి తలుచుకుంటే అతని మనసు జాలితో నిండిపోయింది.

అటు మసకచీకటిలో ఆమె భర్తకోసం వెరికిస్తూంది. ఇటు ఇతడు భార్యను మరిచి ట్యూబ్ లైట్లకాంతిలో వింత లోకములో విహరిస్తున్నాడు. అతనికి నిజజీవితం ఎప్పుడోకాని గుర్తుకురాదు.

గంట గడిచింది ఆమె నిలువుకాళ్ళమీద నించునే వుంది. వెంకటేశ్వర్లు లేచివచ్చే సూచనలేమీ కనిపించలేదు. రాజు వుండబట్టలేక నెమ్మదిగా గేటు బయటికి వెళ్ళాడు.

"అమ్మా! మీరు నిజంగా వెంకటేశ్వర్లుగారి భార్యేనా?" అన్నాడు.

"సందేహముగా వుందా!" అంది. ఆమె కంఠం కఠినముగా ధ్వనించింది. అప్పటివరకూ శాంతసరోవరంలా ఉన్న నదికి వరద వస్తే ఎలా కల్లోలపడుతుందో అలా అయింది ఆమె.

"మరోలా అనుకోకండమ్మా? భార్యను ఇలా గౌరవించిన భర్తను చూడడం ఇదే మొదలు" అన్నాడు రాజు.

"నా అదృష్టము అలావుంది" అంది ఆమె.

"అయినా మీరిలా ఒంటరిగా చీకటిలో రావడము మంచిదికాదమ్మా" అన్నాడు రాజు.

"చీకటి నన్నేం చేస్తుంది బాబూ!"

"చీకటి ఎవరినీ ఏమీ చెయ్యదు, అమ్మగారూ! ఏదైనా చెయ్యడానికి అవకాశము ఇస్తుంది అందుకే ఎవరి జాగ్రత్తలో వాళ్ళుండాలి"

"ఉండాల్సిందే కాని, ఏం చేయను? బాబుకు జబ్బు ఎక్కువైంది. రోజూ నర్సింగ్‌హోమ్‌కి తీసుకువెళుతూనే వున్నాను. ఈరోజు డాక్టరుగారు ఏవో ఇంజక్షన్లు, మందులు వ్రాసిచ్చారు. బాబును ఒకనర్సుకు అప్పగించి ఇలావచ్చాను, చేతిలో డబ్బులేదు. వుంటే ఇక్కడికి రాకపోదును" అంది ఆమె.

"అలాగా!....అయితే వారికి మరోసారి గుర్తుచేసి వస్తాను" అన్నాడు రాజు.

"సార్! బాబుకు జబ్బుగా వుందట. మీ...." అని ఆగిపోయాడు రాజు.

వెంకటేశ్వర్లు తీక్షణంగా చూశాడు. అప్పుడే కౌంట్ ఇచ్చాడులా వుంది, ముఖం నల్లబడి వుంది.

"ఏం జబ్బట, ఒస్తాన్లే.... వెళ్ళమను" అని కసురుకున్నాడు వెంకటేశ్వర్లు ముక్కలు పంచుతూ.

పేకాట ఒక నిషాలాంటిది మానవుడిలోని మనోబలాన్ని, ఆవేశాల్ని కర్తవ్యాల్ని నిద్రపుచ్చుతుంది. ఈ వ్యసనం వల్ల ఎందరి ఇళ్లలో దీపాలు ఆరిపోయాయో, ఎందరు పిల్లలు అనాథలై అడుక్కుతింటున్నారో" అనుకున్నాడు రాజు.

రాజు చరచరా వచ్చేశాడు గది బయటికి. ఊళ్ళోకి వెళ్ళి రావడానికి ఒకగంట పర్మిషనడిగి వచ్చాడు,

"అమ్మా! ఆ మందులు వ్రాసిచ్చిన కాగితం నాకిచ్చి మీరు వెళ్లండి, నేను మెడికల్‌స్టోర్సుకి వెళ్ళి మందులు తెస్తాను" అన్నాడు.

"వారు...."

"వారు వచ్చే స్థితిలో లేరమ్మా, నన్ను వెళ్ళి మందిప్పించి రమ్మన్నారు" రాజుగొంతు జీరబోయింది.

ఆమె ప్రిస్కృప్షన్ వ్రాసిన కాగితం ఇచ్చింది "బాబు ఎక్కడున్నాడు అన్నాడు రాజు-

"జనతా నర్సింగ్ హోమ్‌లో"

"అది నాకుతెలుసు మీరు వెళుతూ వుండండి చిటికెలో వచ్చేస్తాను" అన్నాడు-

చెరొక వైపుగా కదిలారు-

కొంచెంసేపటికి రాజు జనతా నర్సింగ్ హోమ్‌కి వెళ్ళాడు అక్కడ

దుర్గ రాజుకోసం ఎదురుచూస్తూంది మందులు తీసుకుని ఆమె లోపలికి వెళ్ళింది, రాజు వరండాలో బెంచీమీద కూర్చున్నాడు—

కాసేపటికి ఆమె బాబుని ఎత్తుకుని బయటికి వచ్చింది, రాజు లేచి ఆమెవెంట రోడ్డుమీదకు వచ్చాడు.

"అమ్మగారూ! డాక్టరుగారు ఏమన్నారు? బాబుకు ఫరవాలేదుగదా?" అన్నాడు రాజు.

"అలాగేవుంది. డాక్టరుగారేమో బాబును ఇక్కడే ఉంచమంటారు, కాని మనం అంతడబ్బు ఎక్కడ తేగలం? అదిగాక ఇల్లు ఇక్కడికి దగ్గరే. నిమిషంలో పరిగెత్తి రావచ్చు, అందుకని బాబుని ఇంటికే తీసుకువెళుత న్నాను. నువ్వుతెచ్చిన మాత్రలు అరగంటకు ఒకటి చొప్పున వెయ్యమన్నా రు అంది దుర్గ నడుస్తూ.

రాజు ఏమీ మాట్లాడలేదు. ఆమెతోపాటు నాలుగడుగులు వేసి— అమ్మగారూ, "ఇంటివరకూ తోడుగా వస్తాను" అన్నాడు. రాజు ముందుకు నడుస్తూ

వద్దు బాబూ! ఇప్పటికే నువ్వెంతో శ్రమపడ్డావు, నీ మేలు మరువ లేను అంది దుర్గ, దుఃఖతరంగిణిలో చిన్నచిన్న లహరులు లేచినట్లు ఆమె పెదవు లల్లరాయి

"ఇంతమాత్రానికేనా మీరు శ్రమ, మేలని పెద్ద పెద్ద మాటలు వాడు తున్నారు, అవి నావంటి చిన్నవాడికి తగవు"

పెద్దా చిన్నాకాదు, ఆదవలో ఆదుకొన్నవారికి కృతజ్ఞత చూపడం ధర్మంకదా" అంది దుర్గ కొంగుతో కళ్ళు వత్తుకుంటూ ఆమె దుఃఖం ఆపుకోవడానికి ప్రయత్నిస్తున్నదని రాజు గ్రహించాడు.

"ధర్మం కావచ్చు కష్టాల్లోవున్న వారికి తోచిన విధముగా సహాయ పడడం అన్ని ధర్మాలకూ మించిన ధర్మం. నా మట్టుకు నేను తోటివారిని ప్రేమిస్తానమ్మా, కులమతాలు కాని, బీద గొప్ప తేడాలు కాని, నీతిలేనివాడు

జాతిగలవాడు అనే ప్రసక్తి కాని నాకు అవసరము అనిపించదు" అన్నాడు రాజు.

"నువ్వు అదృష్టవంతుడివి బాబూ! వయసు చిన్నదయినా మనసు పెద్దది" అంది దుర్గ. ఆమె మాట్లాడలేక పోతూంది. ఆమె కంఠంనిండా గాద్గదికత, గుండెలనిండా దుఃఖపువెల్లువ పారాడాయి.

రోడ్డు నిర్మానుష్యంగాను, నిశ్శబ్దంగాను వుంది. ఇద్దరూ మౌనంగా కొంతదూరం నడిచారు.

"అమ్మగారూ!.... అన్నాడు రాజు నెమ్మదిగా.

"ఊఁ...." అంది ఆమె.

"మిమ్మల్ని ఒకమాట అడుగుతాను— కోపగించుకోరు కదా ?" అన్నాడు రాజు.

"కోపమా? ఎందుకయ్యా?" అంది దుర్గ,

"అదికాదమ్మా! అయ్యగారు రాత్రనక, పగలనక క్లబ్బులో పేకాడుతూ ఆరోగ్యము చెడగొట్టుకుంటున్నారు. మీరు ఏమాత్రం సుఖపడడం లేదని, అగ్నిని గుండెలో దాచుకుంటున్నారనీ అర్థమవుతూనే వుంది. మరి మీరు ఆయనను మందలించరా? మీ పెద్దవాళ్ళకు తెలియజేసి చీవాట్లు వేయించగూడదా?" అన్నాడు.

"అటు చూడు, నల్లటిఆకాశములో చిన్నగీతలా కనిపిస్తున్నాడే చంద్రుడు ఒకప్పుడు నిండుగానే వుండేవాడు, వెన్నెల్ని విరజిమ్మేవాడు- అవునుకదా? వారూ అంతే! బాబూ! స్వతహాగా మంచివారే! పెళ్ళయిన కొత్తలో ఎంతో మురిపెంగా చూసుకునేవారు. సంవత్సరం క్రితమే వారు పేకాటవలలో పడ్డారు. చెడుస్నేహ ఫలితంగా ఇలా మారిపోయారు, వారిని నేను మందలించననీ, చూస్తూ వూరుకుంటున్నాననీ అనుకుంటున్నావా? వారి మార్గాన్ని మళ్ళించాలని ఎంతో ప్రయత్నించాను! ప్రతిసారి భంగపడ్డాను, కాళ్ళను కన్నీటితో కడిగాను. ఆయన మారలేదు సరికదా, చావుదెబ్బలు కొట్టడము మొదలుపెట్టారు. మా అత్తమామలు ఆయన్ని అదుపులో పెట్టా

లని ప్రయత్నించి, ఫలితముగా తిట్లు, చీవాట్లు తిని అంతటితో మర్యాద దక్కించుకొని వెళ్ళిపోయారు" అని దీర్ఘంగా నిట్టూర్చి కళ్ళు తుడుచు కుంది.

రాజు మౌనముగా వింటూ అడుగులు వేస్తున్నాడు. ఆమె బాబుని ఒకభుజము మీదనుంచి మరొక భుజానికి మార్చుకుంది. బాబు నిద్రలో పడి తల్లి భుజముమీద తల వాల్చాడు.

నిశ్చలంగా నిగూఢంగా నిర్మలాకాశము నిదురపోతూంది. వారిద్దరూ పక్కపక్కనే నడుస్తున్నారు. ఒక వీధిదీపము తన వెలుగును కొంత పరిధి లోనే వ్యాపింపజేస్తున్నది. మరొకదీపం చేరేలోపల చీకటి. ఆ చీకటి వెలుగులు వారిమీద పడుతూ, ఇవే జీవితములో వెలుగునీడలు అని సందేశము ఇస్తున్నాయి.

ఇల్లు వచ్చేసింది. దుర్గ తాళము తీసి ముందుగదిలో లైటు వేసింది.

"లోపలికి రా బాబూ," అంది.

"పద్మమ్మగారూ, నాకిప్పటికే ఆలస్యమైంది. త్వరగా వెళ్లకపోతే మాటవస్తుంది" అన్నాడు రాజు.

"ఫరవాలేదు. కాసేపు పేవతీర్చుకో. కాసిని మంచినీళ్ళు తాగి వెడుదువు గాని" అంది ఆమె.

రాజు లోపలికి వచ్చి కూర్చున్నాడు. ఆమె గ్లాసుతో మంచినీళ్ళు అందించింది. అతను నీళ్ళుతాగుతూ ఆపి–"అమ్మగారూ! మీరు కొన్నాళ్ళ పాటు పుట్టింటికి వెళ్లివుంటే బాగుంటుందేమో?" అన్నాడు.

"పుట్టింటికా? అంత భాగ్యానికి నేను నోచుకోలేదు. అన్నయ్య ఒక్కడే నాకు నాఅన్నవాడు. కానీ ఇంటికివచ్చిన చెల్లెలిని ఆదరించడానికి కూడా అస్వతంత్రుడు. ఐనా నేను కొన్నాళ్లు ఎక్కడో వున్నంత మాత్రాన ఆయన మారతాడా? మనపిచ్చిగాని– నేనుకూడా లేకపోతే అసలు ఇంటి ముఖమే చూడరేమో? అందువల్ల పరిస్థితులు మరింత విషమించడము తప్ప లాభంలేదు" పాలిపోయిన ఆమె ముఖములో, కనుబొమల క్రింద కాంతి నశించిన విశాల నయనాలు కన్నీటితో నిండిపోయాయి.

"మీరుచెప్పింది నిజమేనమ్మా. అలాగని వారి మానాన వారిని వదిలేసి చూస్తూ వుంటారా ?"

"చూడక చేసేదేముంది? లోకంలో నాకన్నా దౌర్భాగ్యులున్నారేమో కాని, నేను అన్నివిధాలా దురదృష్టవంతురాల్ని" అందిదుర్గ. ఆమెచెక్కిళ్ల మీదనుంచి రెండు అశ్రుకణాలు జారి గుండెల్లో మాయమయ్యాయి.

రాజు బరువుగా ముందుకు అడుగువేశాడు అతని హృదయము పరితాపముతో నిండిపోయింది. మనసు అర్ద్రమైంది. కళ్ళలో తిరిగిన కన్నీరు తిరిగి కళ్లలోనే ఇంకిపోయింది.

"అమ్మగారూ! మీరు అలోచించి ఏదైనా గట్టిప్రయత్నము చెయ్యక పోతే లాభములేదు. అయ్యగారిలో రవ్వంతకూడా మార్పు వచ్చేట్లులేదు" అన్నాడు రాజు

నిజమే. భార్య తనకోసము వచ్చిందని, రోడ్డుమీద నిలుచుని నిరీక్షిస్తున్నదని తెలిసీ కనీసం ముఖమైనా చూపించలేదు, బాబుకు జబ్బుగా వుందని విని ఆవేదనైనా పొందలేదు. భార్య, బిడ్డలకన్నా ఆయనకు పేకాట ముఖ్యమైపోయింది ఎంత విచిత్రంగా మారిపోయాడు.

పెళ్లయిన కొత్తలో తననివదిలి క్షణమైనా గడపలేనని అంటూ వుండే అయనేనా ఇప్పుడు రోజులతరబడి తనని చూడకుండా వుంటున్నారు.

"దుర్గా! నీ కళ్ళలో నవ్వు తళతళలాడుతోంది నీముఖం వెలుగులో కళకళలాడుతోంది, నువ్వు నా నీడ, నాలో సగభాగం" అంటూ పొగుడుతూ ఎంతో మురిపెంగా చూసుకున్న ఆయనేనా తనంతట తనే వెళ్ళినా ముఖం కూడా చూపలేదు. ఆ రోజులు ఇక రావు, అప్పుడు తను బంగారుపళ్లెంలో పరమాన్నం తింటూ వుండేది. కాని ఎవరో బలవంతాన ఆ పళ్ళాన్ని లాగేశారు-అనుకొంది.

దుర్గ మాటా పలుకూ లేకుండా ఏదో అలోచిస్తు నించోవడం చూసి రాజు లేచి "వెళ్ళొస్తానమ్మా!" అన్నాడు.

"మంచిది బాబూ!" అంది దుర్గ.

రాజు బయటికి వెళ్ళిపోయాడు. పాపం అతనికేం తెలుసు త్రోవలో తనకోసము పెద్దపులి కాచుకొని వుందని.

"ఫెడీ"మని ఎవర్నో ఎవరో కొట్టిన శబ్దమువిని ఆమె తలుపు తెరిచింది.

రాజు మట్టిలోపడి విచిత్రరచూపులు చూస్తున్నాడు. పక్కవాటాలోని ధర్మారావు పెద్దపులిలా నిలబడి క్రూరంగా చూస్తున్నాడు. ఆ దృశ్యము చూసి దుర్గ గుండెలు అవిసిపోయాయి.

వెంకటేశ్వర్లు పేకాటకు బానిసకావడం, సంసారంలో ఆర్ధికముగా ఇబ్బందులు రావడము, అతను రాత్రులు క్లబ్బులోనే గడపడం-అన్నీ గమనించాడు పక్కవాటాలోవున్న ధర్మారావు. నీచపు ఆలోచనలు అతన్ని ముసురుకున్నాయి రక్తమాంసాలు వున్నది, ఉప్పూ, కారం తింటున్నది, యౌవ్వనంలో వున్నది, కోర్కెలు తీరని అశాంతిలో వున్నది తనకి లొంగకపోతుందా? అనుకుని ప్రయత్నించాడు ధర్మారావు. కాని దుర్గ లొంగలేదు. పిచ్చిపిచ్చి వేషాలువేస్తే తన భర్తకు, ఇరుగుపొరుగు వారికి చెప్పి పరువు తీయిస్తానని ఎదురుదెబ్బ తీసింది కాని ధర్మారావు పగబట్టిన పాములా ఎదురుదెబ్బకు చావుదెబ్బే తీశాడు.

"ఎన్నాళ్ళి నుంచీ సాగుతోందీ గ్రంథం? చెప్పరా రాస్కెల్" అని మళ్ళీ ఒకటి వేశాడు ధర్మారావు.

ఏం మాట్లాడలేకపోయాడు రాజు. తనపై వేసిన అపవాదుకు కారణాన్ని, కారణాన్ని కల్పించినవారి స్వార్ధాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించాడు, కాని అది నీడనుచూసి రూపకల్పన చేయడంలాంటి అసాధ్యం అనుకున్నాడు

ధర్మారావు కేకలతో ఇరుగు పొరుగువారికి నిద్రాభంగమయింది. చోద్యం చూడడానికి లేచి వీధిలోకి వచ్చారు.

"పైకి పతివ్రతలు. చేసేవి సానిపనులు" అంటున్నాడు ధర్మారావు.

ఎదురుదెబ్బమీద ఎదురుదెబ్బ తగిలినట్లు గిలగిలలాడింది దుర్గ. నోట మాట రాలేదు. నాలుక పిడచకట్టుకుపోయినట్లయింది. కళ్ళనిండా నీరునిండి మసక మసకగా....వీళ్ళ మనుష్యులా? లేక క్రూరమృగాల సమూహమా? అన్నట్లు కనిపించారు

ప్రాణంవున్న శిలాప్రతిమలా గుడ్లు అప్పజెప్పి నించుండిపోయాడు రాజు ఈ పరిస్థితిలో ఏం చెయ్యాలో అతనికి అర్థంకాలేదు. వెన్నెల్లో నించున్నవాడు తననీడను, అది నా నీడకాదు అంటే ఎవరు నమ్ముతారు?" అనుకున్నాడు

"ఏంచేస్తుంది మరి? మొగుడి సంపాదనంతా పేకాటకే చాలదు. గడ్డి తింటుందా? ఏదో ఒక సంపాదన" అంది ఆమె ఎవరో, బుగ్గను వేలుతో నొక్కుకుంటూ అది వ్యంగ్యమో, సానుభూతో అర్థంకాలేదు రాజుకు.

గొడ్డు గోతిలో పడితే తలాఒకమాట అంటారు భరించక చేసేదేముంది? దుర్గ ఎంత సహనశీలి అయినా ఇటువంటి అవమానం సహించలేకపోయింది తను నిర్దోషనని వాదించే ఓపిక ఆమెకు లేకపోయింది. బాబుకు జబ్బుగా వుండడం. భర్త మూడురోజుల నుంచి ఇంటికి రాకపోవడము వల్ల ఆమె శక్తి పూర్తిగా హరించుకుపోయింది.

లేకపోతే, "ఇదుగో ఓ మనుషులారా! నా మంచిచెడ్డలు మీకెందుకు నేను ఆలోచించుకోగలను. నాకన్నా ఎక్కువ మీకెలా తెలుస్తాయి? నా మీద నాకులేని బాధ్యత మీకువుందా? ఇన్నాళ్ళూ నేను ఒంటరిగా ఎన్ని బాధలు పడుతున్నానో మీకు అక్కర్లేకపోయింది. ఇప్పుడు ఎవరో నాకు సాయము చేయబోతే మీకళ్ళు మండాయా? నేను అన్నము తింటున్నానో వస్తులుంటున్నానో అని అడగని మీరా నన్ను అవమానించేది? అందుకు మీకేంహక్కు వుంది! అసలు మీరెవరు? ఆ కుర్రాడు నా తమ్ముడిలాంటివాడు వాడు ముళ్ళపొదలో మల్లెతీగ, ఎందుకు వాడిని కొడతారు? వాడిని ఏం సమాధానము చెప్పమంటారు? గోవుని ఎన్ని దెబ్బలు కొడితేమాత్రం ఏం చెబుతుంది? ఇక వెళ్ళండి, మర్యాదగా వెళ్ళండి" అని వుండేది మండిపడుతూ.

లేకపోతే, "ఇంతకీ నాభర్త నన్ను నిరాదరణ చెయ్యబట్టే కదా మీరు నన్ను వేలెత్తి చూపించగలిగారు? అందుకు నేనేంచెయ్యను? భార్యగా ఏం చెయ్యాలో అన్నీచేశాను. ప్రేమిస్తున్నానంటే పొంగిపోయాను. లాలిస్తే సంబరపడ్డాను నవ్విస్తే నవ్వాను ఇష్టంవున్నా లేకపోయినా అర్ధరాత్రులు అవసరాలు తీర్చాను. తిడితే భరించాను. తంతే ఏడ్చాను. అంతకన్నా నేనేం చేయను? నా పరిస్థితిలో మీరుంటే ఏంచేస్తారు ?

"ఎందుకు నన్ను హేళనగా చూస్తున్నారు? నేనూ మీలాంటి స్త్రీనే. నాకూ మనసు, రక్తమాంసాలు వున్నాయి కాకపోతే మీరు అదృష్టవంతులు నేను దురదృష్టవంతురాల్ని. వంచితురాల్ని, పీడితురాల్ని. ఇప్పటికే అనేక దెబ్బలు తిన్నాను. ఇన్నాళ్ళూ అన్నీ సహించాను. నాలో ఓర్పు నశించిపోయింది. ఇంకా భరించే సహనము నాలోలేదు. మీకు నమస్కారం చేస్తాను. ఇక వెళ్ళిపోండని" బ్రతిమాలి వుండేది.

కాని దుర్గ మండిపడనూలేదు. బ్రతిమాలనూ లేదు, అచేతనముగా నించుండిపోయింది

"ముందు వాడిని తన్ని తగలేయండి. వెంకటేశ్వర్లు వచ్చాక దీని బండారం బయటపెడదాము, వెంటనే ఇల్లు ఖాళీచేయించాలి, చెడిపోయిన వాళ్ళను మనమధ్య వుంచడం అనర్ధం" అన్నాడు ఎవరో తల నెరిసిన తాతయ్య.

వాళ్ళ అపరాధులో, నిరపరాధులో ఎవరూ ఆలోచించలేదు. సంఘం సందేహించింది. దానికి తెలుపు నలుపుగా కనపడింది, కెరటంలో కెరటము కలిసి పెద్దకెరటమై వారిని ముంచివేసింది. నిర్దోషులు పరిస్థితుల పలుగు రాళ్ళ మధ్య నలిగిపోయారు.

"ఛీ.... ఈసారి ఈవీధి ఛాయలకు వచ్చావా ప్రాణాలతో తిరిగి వెళ్ళవు" అన్నాడు ధర్మారావు రొప్పుతూ—"చూశావా నా తడాఖా"అన్నట్లు గర్వముగా చూశాడు ఆమెవంక-

దుర్గ స్నిగ్ధశిలామూర్తిలా కూర్చుండిపోయింది.

రాజు వెళ్ళిపోయాడు జనం పలచబడ్డారు, ఒక్కొక్కళ్ళే దుర్గ ప్రవర్తన గురించి చర్చించుకుంటూ. వెలుగునుంచి చీకట్లోకి తప్పుకుంటు న్నట్లు ఎవరి ఇళ్ళలోకి వాళ్లు వెళ్ళిపోయారు.

రాజు అడుగులు వేస్తున్నాడు కాళ్లు ముందుకి పడుతూనే వున్నాయి, కానీ అది జీవంలేని నడక. వెళ్ళేటప్పుడు సంతోషముగా వెళ్ళాడు, వచ్చేట ప్పుడు విషాదాన్ని వెంటపెట్టుకుని తనరూపాన్నే మార్చుకుని వస్తున్నాడు-

అతని జుట్టు చిందరవందరగా చెదిరిపోయింది. తలనిండా ఎర్రటి మట్టి అసహ్యంగా అంటుకుంది పెదవిచిట్లి రక్తంకారింది, చొక్కా చిరిగి పీలికలైంది. మోచేతులు, మోకాళ్లు దోక్కుపోయి మంటలు పుడుతున్నాయి

మనస్సుని, శరీరాన్ని చిత్రవధచేసి హృదయాన్ని తూట్లు చేశారు. మంటల్లో చిక్కుకున్న పూరిల్లులా దగ్ధమైపోతూంది. మనసు హృదయంలో ఉద్వేగం ఉద్భవించింది.

ఆమె ఎవరో? ఆమెకు, తనకు ఏ బంధం ఏముంది? మానవత్వం మరిచిపోయి, తన కనీస ధర్మాన్ని విస్మరించిన ఒక మనిషికి భార్య ఆమె. ఆమె పరిస్థితులు చూసి జాలిపడ్డాడు ఒకరిని చూసి జాలిపడడం, ఆపదలో అదుకోవడం అపరాధమా?

తన ఖర్మమేమో! నిస్వార్ధంగా ఒకరికి సాయపడబోయినా, తిట్లు తన్నులు ఎదురవుతున్నాయి. ఇలా జరగడం తనకి కొత్తకాదు.

క్లబ్బు కాంటీన్‌లో పనిచేసే క్లీనరు కుర్రాడికి జబ్బుచేసింది. వాడిని పలకరించే దిక్కుకూడా లేదు. అప్పుడు తను వాడిని హాస్పిటల్‌కు రిక్షాలో ఎక్కించుకుని వెళ్ళాడు. మందులకూ మాకులకూ తన సొంత డబ్బు పాతిక రూపాయలు ఖర్చు పెట్టాడు జబ్బు నయమయే వరకూ సేవ చేసి బ్రతికించాడు. తీరా వాడు పనిలోకి వచ్చాక డబ్బు సంగతి ఎత్తేవాడే కాదు. పోనీలే అని తను సరిపెట్టుకున్నాడు. కాని, వాడో? ఎప్పటికైనా డబ్బు

ఇవ్వాల్సి వస్తుంది కదా అని ఏదో పేచీ పెట్టుకుని తనతో పూర్తిగా మాట్లాడడం మానేశాడు. వాడికిప్పుడు తను గర్భశత్రువు

ఒక రోజు నాలుగేళ్ళ పాప బజార్లో దారి తప్పి, ఏడుస్తూ తిరుగుతూంది. తను జాలిపడి ఆ పాపను ఇంటికి చేర్చాలని ప్రయత్నించాడు. తలిదండ్రుల పేర్లు ఆ పాప చెప్పలేకపోయింది. సరేనని పోలీస్ స్టేషన్‌లో అప్పగించి వచ్చాడు, మరునాడు పోలీసులు తన కోసం క్లబ్బుకు వచ్చారు. ఆ పాప చెవుల రింగులు పోయాయట. అవి తనే దొంగిలించాడని అనుమానం ఆ పాప తండ్రికి, తనకు రాజీ కూర్చారు క్లబ్బు ప్రెసిడెంటుగారు. అది నెల నెల తన జీతంలో కొంత ఆ బంగారు రింగుల క్రింద ఇచ్చేట్లు ఏర్పాటు. తను సరేననక తప్పేదేముంది?

జ్ఞాపకం చేసుకుంటే జీవితంలో ఇలాంటి సంఘటనలు ఇంకా ఉన్నాయి. అతనికి ఒక విషయం మాత్రం ఎంతకీ అర్థం కాలేదు, ఒకరు బాధపడుతూ ఉంటే చూస్తూ ఉండడం లేదు తను. తనకు తోచిన సహాయం చెయ్యాలని తహతహలాడతాడు, చేస్తాడు కూడా. అందుకు ప్రతిఫలంగా వీళ్ళు తనకి ఏమీ ఇవ్వనక్కర్లేదు. కాని, ఎందుకు తనను అనుమానిస్తారు? అవమానిస్తారు? ఇందుకేనా తను జాలి పడతాడు? ఇందుకేనా తను తాపత్రయ పడతాడు? ఇంతేనా లోకంలో సేవకి ఉన్న విలువ? అనుకున్నాడు రాజు.

రాజు జీవము లేని నడక నడుస్తూనే ఉన్నాడు.

బాబు ఏడుపు విని ఉలిక్కిపడింది దుర్గ. ఆమె ఆలోచనల తలుపులు మూసివేసి బాబు ఉయ్యాల దగ్గిరకి వెళ్ళింది.

బాబు గుక్కపట్టి ఏడుస్తున్నాడు. ఎత్తుకుని భుజంమీద వేసుకుని జోకొట్టింది. కాసేపటికి బాబు ఏడుపు మానాడు. మళ్ళీ వాణ్ణి ఉయ్యాల్లో వేస్తుంటే ఒళ్ళు చల్లబడినట్లు తోచింది. చూస్తే బాబుగుడ్లు తేలవేశాడు. కాళ్ళు, చేతులు ఆడించడం కూడా లేదు. దుర్గ గుండెలు ఝల్లుమన్నాయి.

ఇంటికి తాళం వేసి ఆ చీకట్లోనే నర్సింగ్‌హోమ్‌కి బయలుదేరింది

దుర్గ ఆమె నడిచిందో, పరిగెత్తిందో ఆమెకే తెలియదు. రొప్పుకుంటూ, వణుకుతున్న కాళ్ళతో నర్సింగ్ హోమ్ మెట్లు ఎక్కింది.

డాక్టర్ గారు బాబును పరీక్షించి పెదవి విరిచారు. "బంగారం వంటి బిడ్డమ్మా! ఇలా జరుగుతుందనుకోలేదు మీరు దురదృష్టవంతులమ్మా!" అన్నారు.

బాబు ఇక లేడు అని విన్న ఆమె గుండెల్లో బల్లెందిగిన దానిలా కొట్టుకులాడింది. "నా బాబు....నా బాబు...." అని గట్టిగా రోదించింది. ఏడ్చి ఏడ్చి అలిసిపోయింది ఆకులు రాలిపోయి, కొమ్మలు విరిగి, ఎండి మోడ యిన చెట్టును ఒక తన్ను తంతే ఎలా విరుచుకు పడిపోతుందో అలా పడి పోయింది.

తెలివి వచ్చిన తరువాత డాక్టర్ ఓదార్పు మాటలు చెప్పి, బోయ్‌ని తోడిచ్చి, ఇంటికి పంపారు. దారి పొడుగునా వీధి దీపాలు వెలుగునిస్తున్నా ఆమెకు కటిక చీకటిలో నడిచినట్లే ఉంది.

ఏడ్చి ఏడ్చి ఆమె గొంతుక పూడుకుపోయింది. ఒళ్ళు కుమిలిపోతూ ఉంది. మనసు కుంగిపోతూ ఉంది. ఆమె కళ్ళలో కన్నీళ్ళు అగి అగి రాలు తున్నాయి. వాన వెలిశాక తడి చెట్లమీది నీటిబొట్లు నేలమీద రాలి నట్లున్నాయవి.

ఇన్నాళ్ళూ గతాన్ని నెమరువేసుకుంటూ, వర్తమానంతో రాజీపడి పోయి, భవిష్యత్తు మీద ఆశ పెట్టుకుంది కాని, అది తెలియని అగాధం అనీ, కనిపించని కాంతి అనీ ఆమె తెలుసుకోలేకపోయింది.

'ఈ చిన్నారిబాబు రేపు బలవంతుడు కాబోతున్నాడు. వాణ్ణి ఆడిస్తూ, పాడిస్తూ కష్టాలన్నీ మరిచిపోతాను, వాడి నీడలో తను సుఖపడాలి' అనుకుంది. ఆ ఆశతోనే ప్రాణాలు నిలుపుకుంది.కాని, ఇప్పుడిక ఆశలేదు- ఆశ లేకుండా మనుగడా లేదు. నేనింకా ఒంటరిగా కష్టాలు అనుభవించ లేను-అనుకుంది దుర్గ,

ఈ చీకటిబతుకు తెల్లవారదు, బతికున్నంత కాలం తన జీవితానికి వెలుగు లేదు– అని ఆమె నిర్ణయించుకుంది.

శూన్యంలోకి చూసింది దుర్గ మనసంతా శూన్యమైనట్లు తోచింది.

క్లబ్బు కొంచెం దూరంలో ఉందనగా ఎదురుపడ్డాడు వెంకటేశ్వర్లు. రాజును చూస్తూనే-"రాజూ! ఆమె వెళ్ళి పోయిందా?" అన్నాడు.

"ఎవరు? పనిమనిషా?" అన్నాడు రాజు వ్యంగ్యంగా

"ఒరేయ్! ఆమె మా పనిమనిషి కాదురా! నా భార్య" అన్నాడు నెమ్మదిగా. అతని స్వరంలో బాధ ధ్వనించింది.

"ఇందాక మీరు పనిమనిషి అంటే.... అనుకున్నాను, సార్!"

"అరే!.....రాజా! ఏమిట్రా ఈ అవతారం? ఏం జరిగింది?" అంటూ దగ్గరికి వచ్చాడు వెంకటేశ్వర్లు .

"కంగారుపడకండి, సార్! పెద్ద ప్రమాదం కాదులెండి" అన్నాడు రాజు మామూలుగా.

"ఆ నెత్తురుమరక లేమిటి? చొక్కా చినిగిపోయిందేం? చెప్పవేరా మొద్దూ ? ఏదైనా దెబ్బలాట జరిగిందా?" అన్నాడు ఆందోళనగా,

"ఇదా? ఇది నేను జాలిగుండె కలిగిఉండడం వల్ల జరిగిన సత్కారం. సార్! నిజం, సార్. నా కిప్పుడు సంతోషంగా ఉంది. ఎందుకంటే ఈ లోకానికి మనసూ మానవత్వం లేని వాళ్ళంటే చాలా ఇష్టం. అది ఇప్పుడు నేను తెలుసుకున్నాను. నాకు మనసు అక్కర్లేదు. అది పారేసుకుంటాను. మీ కవసరమేమో, సార్?" రాజు మాటల్లో బాధ, వ్యంగ్యం ధ్వనించాయి,

"ఒరేయ్, రాజా! నీ కేదైనా దయ్యం పట్టిందేంరా? ఏమిటా మాటలు? సరిగా చెప్పవేడూ! ఇంతకి అది వెళ్ళిపోయిందా?"

"మీరు వస్తారు....వస్తారు అని ఎదురుచూసి చూసి ఆమె వెళ్ళిపోయారు, సార్! మీ వంటి యోగ్యుడైన భర్త దొరికినందుకు చాలాసంతో

షిస్తూ వెళ్ళిపోయారు, సార్" అన్నాడు రాజు. అతని గొంతు జీరబోయింది కన్నీళ్ళు బుగ్గలపైకి దూకి, జలపాతంలా జారిపోయాయి.

వాడిప్రవర్తన చూసి వెంకటేశ్వర్లు అయోమయంలో పడిపోయాడు.... వాడెందుకు ఇలా మాట్లాడుతున్నాడో ఏమో అర్థం కాలేదు.

అతను రాజు చెయ్యి పట్టుకుని బుజ్జగించే ధోరణిలో -"ఒరేయ్ రాజూ! నీకు పుణ్యముంటుంది కాని, ఏం జరిగిందో చెప్పరా ?" అన్నాడు.

"సార్!.... మీరు ఎంతసేపటికీ రాకపోయేసరికి మీమీద నాకు కోపంవచ్చింది. కాని అమ్మగారిమీద జాలికలిగింది. "నేను మందులుతెస్తాను మీరు నర్సింగ్ హోమ్‌కి వెళ్ళండి అన్నాను. మీరే పంపారు అని చెప్పాను. చెప్పినట్లే ఇంజక్షన్ బాటిల్, మాత్రలు తీసుకువెళ్ళి యిచ్చాను"

"డబ్బో?—"

"నాదే సార్...."

"సిదా?....ఊఁ.... తరవాత?"

"తరవాత నేను ఇంటివరకు తోడుగా వస్తానని అన్నాను. అమ్మగారు వద్దన్నారు. నేనే వినకుండా వెళ్ళాను. వెళ్ళకుండా వున్నా బాగుండేది రాజుగొంతు బాగా బొంగురుపోయింది. ఏడుపు ముంచుకువచ్చింది.

"ఊఁ....తరవాత ?"

"నేను అమ్మగారిని ఇంట్లోవదిలి తిరిగి వస్తున్నాను. ఇంతలో మీ ఇరుగుపొరుగు వాళ్ళు నన్ను పట్టుకొని కొట్టారు. తరవాత తిట్టారు, నయం ప్రాణాలతో వదిలారు"

"ఎందుకురా కొట్టడము? ఏదైనా దొంగతనము అంటగట్టారా?" అన్నాడు వెంకటేశ్వర్లు.

"అదయినా నేనింత బాధపడేవాణ్ణి కాదు. కాని ...కాని....ఈనోటితో అదెలా చెప్పనుసార్! ఆ లోకులు అన్నమాటలు. ....అబ్బా!ఎలాచెప్పేది? అవి తలచుకుంటేనే నా గుండెలు బ్రద్దలై పోతున్నాయి. సార్! మీకు దణ్ణం పెడతాను . అదిమాత్రం అడక్కండి సార్! దయచేసి అడక్కండి"రాజు ఏడుస్తునాడు

వాడలా హృదయవిదారకంగా ఏడుస్తుంటే వెంకటేశ్వర్లు మనసు చలించిపోయింది. "ఒరేయ్ రాజూ! ఫరవాలేదు, చెప్పరా నాకు మేలుచెయ్యబోయి నువ్విలా తన్నులు, తిట్లు, అవమానాలు పొందటం నాకుచాలా సిగ్గుచేటుగా వుంది, చెప్పరా బాబూ చెప్పు ఏం జరిగిందో?" అన్నాడు.

"సార్! అమ్మగారికి, నాకూ నీచసంబంధం అంటగట్టారు" వాడి మాటల్లో వాడి వ్యధిత హృదయం ప్రతిబింబించింది.

వెంకటేశ్వర్లుకి వెనకనుంచి ఎవరో గొడ్డలితో తలమీద కొట్టినట్లయింది. స్థాణువులా నించుండిపోయాడు. అతను ఆలోచనల అరణ్యంలో గిరగిరా తిరుగుతున్నాడు, అంతూపంతూ తెలియడములేదు. బాధ సుడిగుండంలా కడుపులో తిప్పుతోంది- ఒక పెద్ద సుడిగాలివచ్చి అతణ్ణి ఎక్కడికో విసిరి కొట్టినట్లయింది- ఇన్నాళ్ళు కంటిముందున్న పలచటి గాజుపొర పగిలి ముక్కలైపోయింది.

మనసు శకలాలైపోయింది. వేదన గుండెల్ని వేపుతూంది, కాలికింద నేల కదిలినట్లయింది. చాలా సేపటివరకూ మాట్లాడలేకపోయాడు. తరవాత నెమ్మదిగా పెదవులు కదిల్చాడు-

"ఒరేయ్ రాజూ! ఇన్నాళ్ళు మత్తులో పడి నన్ను నేనే మరిచిపోయినందుకు ఇప్పుడు విచారిస్తున్నానురా, నువ్వు తన్నులు తిట్లు తినడానికి దుర్గ అవమానాల పాలవడానికి నేనేరా కారణం- నేనీ విషవలయములో చిక్కుకోకుండా వున్నట్లయితే ఈనాడు ఈపరిస్థితుల్ని ఎదుర్కోవలసి వచ్చేదికాదు అన్నాడు వెంకటేశ్వర్లు బాధగా అతని కళ్ళలో నీళ్లు తిరిగాయి.

"అంతా నా దురదృష్టం సార్! నేను ఎప్పుడు మంచిచెయ్యబోయినా చెడే ఎదురౌతూంది" అన్నాడు రాజు.

"అలా అనకు రాజూ! పరిస్థితుల్ని బట్టి మంచిచెడులు తారుమారవుతుంటాయి- నిజం చెప్పాలంటే మనుష్యుల్లో నీలాంటి నిస్వార్థులు అరుదుగా వుంటార్రా! కాని పరిస్థితుల ప్రభావము వల్ల సంఘం వాళ్ళనే ఏడిపించి, వేధించి హింసిస్తుందిరా- ఒరేయ్ రాజూ! చిన్నవాడివైనా నా కళ్ళు తెరిపిం

చావురా! నీకు నేను ఎంతైనా ఋణపడివున్నాను. నామూలాన నువ్వు దెబ్బలు తిట్లు తిన్నందుకు అవమానాన్ని భరించినందుకు—ఒరెయ్ నన్ను క్షమించరా!"

"సార్! వద్దు సార్! అంతమాటనకండి మీరు మారిపోవడము కన్నా, అమ్మగారి జీవితంలో తేనెజల్లు కురవడంకన్నా నాకు కావలసిందేమీ లేదు" అన్నాడు రాజు.

"రాజూ! ఇక నేను వెళ్ళొస్తాను" అన్నాడు వెంకటేశ్వర్లు.

"వెళ్ళండి సార్ మళ్ళీ రాకండి" అన్నాడు రాజు నవ్వుతూ

వెంకటేశ్వర్లు బలవంతాన నవ్వి, ముందుకు సాగిపోయాడు అతను నడుస్తూ పోతుంటే పాతజ్ఞాపకాలు కుమ్మరిపురుగులా కెలకసాగాయి. కాని బలవంతాన మనస్సు మరల్చాడు. ఇంటికి వెళ్ళగానే తనుచేసిన అన్యాయాలకు దుర్గను ఎలా క్షమాపణ అడగాలో ఆలోచించుకుంటున్నాడు

"దుర్గా! నేను చదువుకున్నవాడినని, తెలివిగల వాడినని ఎంతో మురిసిపోయేదానివి. కాని, నీకు చాలా అన్యాయము చేశాను ఒక్క పలకరింపు కోసం, ఒక్క మృదువైన మందహాసం కోసం, ఒక్క ప్రేమవీక్షణంకోసం నిన్ను మొగంవాచేట్లు చేశాను. కర్తవ్యం మరిచి మానవత్వం లేనివాడిలా ప్రవర్తించాను. నిన్ను నలుగురిలో "పనిమనిషి" అనగలిగాను. దుర్గా! నా వల్ల నువ్వు అవమానింపబడ్డావని తెలిసి కుంగిపోయాను. దుర్గా! ... నన్ను క్షమించు. ఇంకెప్పుడూ కన్నీళ్ళుముఖం చూడను. నీమీద ఒట్టు. నేను చాలా మారిపోయాను" వెంకటేశ్వర్లు తనలో తనే గొణుక్కుంటున్నాడు.

కొంచెం దూరం నడిచిన తరవాత అతని మనస్సు నిర్మలమైంది. అంతరాత్మ అగ్నిసంస్కారం పొందినట్లయింది. శరీరం పూవులా తేలికైంది.

వెంకటేశ్వర్లు మళ్ళీ ఆలోచనలలో మునిగిపోయాడు. "దుర్గ ఏడుస్తూ వుంటుంది. తను కొట్టబోయే దెబ్బలు తలుచుకుని కుమిలిపోతూ వుంటుంది. తనని చూడగానే బెదురుచూపులు చూస్తుంది. నేను నిరపరాధిని. నాకేపాపం తెలియదు అంటుంది. తనకాళ్ళమీద పడుతుంది.

అప్పుడు తను లేపనెత్తుతాడు. "దుర్గా నీ మనసు నాకు తెలియదా ? లోకులు కాకులు. వాళ్ళమాటలు మనసులో పెట్టుకోకు అవి అడుగులేని పాత్రలవంటివి" అంటూ ఓదారుస్తాడు

దుర్గ తనమాటలు విని ఆశ్చర్యపోతుంది. కలా? నిజమాని ? అనుమాన పడుతుంది. తను "నిజం దుర్గా! నేను మారిపోయాను. ఇన్నింక కష్ట పెట్టను" అంటాడు.

దుర్గ ఎంత సంతోషిస్తుందో? తను పరివర్తన చెందాడనివిని సంబర పడి పోతుంది. ఆనందంతో తన్మయత్వం చెందుతుంది.

"ఏమండీ! ఇంకెప్పుడూ నన్నువదిలి వెళ్లరుకదా? పేకాట పూర్తిగా మానేసినట్లేనా?" మన బాబుమీద ఒట్టు పెట్టుకోండి" అంటుంది.

తను నవ్వుతాడు. "పిచ్చిదానా! నామీద నమ్మకంలేదా? నీమీదఒట్టు" అంటాడు, అప్పుడు దుర్గ తనని హత్తుకుపోతుంది"

వెంకటేశ్వర్లు ఇల్లు చేరేవరకూ ఇలాగే ఆలోచిస్తున్నాడు ఇల్లు దగ్గర పడేసరికి వేగముగా అడుగులు వేసాడు.

ఇంట్లో లైటు వెలుగుతూనే వుంది-

"దుర్గ ఇంకా ఏడుస్తూనేవుందా ఏం!" అనుకుని తలుపులు నెట్టాడు-కిర్రుమంటూ అవి బార్లా తెరుచుకున్నాయి-

దూలానికి వేలాడుతున్న దుర్గ శవాన్ని, శాశ్వతంగా నిద్రపోతున్న బాబు దేహాన్ని చూసి "దుర్గా.... బాబూ" అని గావుకేకలు పెట్టాడు వెంకటేశ్వర్లు.

ఇరుగు పొరుగువారికి మరొకమారు నిద్రాభంగమైంది.

*

ప్రచురణ: ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 2-4-71